# అమెరి'కులాసా' కథలు

## – వంగూరి చిట్టెన్ రాజు





## – 10 –

# పరిశుభ్ర గొట్టాల కథ

**సుమారు** మూడు నెలల్ల క్రితం మా క్వీన్ విక్టోరియా ఎండ చేతి చూపుడు వేలు స్పీడ్ లిమిట్ దాటి ఊగడం మొదలు పెట్టింది. అదేదో సినీ నటి జమున గారి తల లాటి ఊపుడు అయితే అయ్యో పాపం అని డాక్టర్ దగ్గరకి తీసుకుళ్లి వైద్యం చేయిద్దును. కానీ చూపుడి వేలు చూపు నా మీదే ఉంది. అనగా ఏదో విషయంలో నా కొంప మునిగిందీ అని అర్థం. ఈ సారి నేను ఎక్కడ పప్పులో కాలు వేశానా అని బుర్ర గోక్కుంటూ ఉంటే "ఏమయినా సరే. ముందు ఆ డక్ట్ క్లీనింగ్ చేయించు. ఇదిగో సియర్స్ కంపెనీ వారి నెంబర్. మా బాస్ ఎలిజబెత్ ఇచ్చింది" అని ఓ కాగితం ముక్క నా చేతిలో పెట్టి ....అవును ..నా బహుమతి నాకు తగిలించేసి వర్క్ కి వెళ్లి పోయింది. ఆ బహుమతి నా తలకాయకి వెనకాల తగిలిందని అని వేరే చెప్పక్కర లేదు.

అసలు మా విక్టోరియా ప్రాణాలకి..తద్వారా నా ప్రాణాలకి ఈ ఎలిజబెత్ మహారాణి ఒక్కర్తి తగలడింది. వాళ్ళింట్లో ఆవిడ మొగుడు ఏ రిపేర్లు చేసినా అది గొప్పగా మా ఆవిడకి చెప్పడం, అది విని ఈవిడ రిపేర్లు చేయించుటయే తప్ప చేయుట ఎరుగని పవిత్ర భారతీయుడని అయిన నన్ను సరిగ్గా అదే రిపేరు చెయ్యమని ఆర్డర్ వెయ్యుట మా జీవిత చరిత్రలో రొటీన్ అయిపోయింది. అవసరం ఉన్నా లేక పోయినా చేయించే ఈ రిపేర్లకి చచ్చేంత డబ్బు దండగ అవుతుంటే ఒక సారి పోనీ ఆ ఎలిజబెత్ మొగుడినే వచ్చి రిపేర్ చెయ్య మన కూడదా అని ఒక చిన్న సూచన ఇచ్చాను ఒక సారి. విచిత్రం ఏమిటంటే..నా సూచన విన్న వెంటనే నా మీద గయ్ అని లేస్తే నేను అర్థం చేసుకుందును కదా. కానీ వారం తర్వాత గయ్ అని లేచింది మా క్వీన్ విక్టోరియా. అది కూడా నా మీద కాదు. ఎవరి మీదో తెలీదు. అసలు రహస్యం ఏమిటంటే ఆ బాస్ మొగుడు అసలు మొగుడు కాదుట. బాస్ కి బాయ్ ఫ్రెండ్ ట. వాడిని కంట్రోల్ లో పట్టుకోడానికి ఆవిడ పన్నే పన్నాగాలుట ఈ రిపేర్ పనులన్నీ. ఆవిడని ప్రసన్నం చేసుకోడానికి పాపం వాడు ఈ పాపం పనులన్నీ చేస్తున్నాడుట. అదీ మా క్వీన్ విక్టోరియా గయ్ మానడానికి కారణం. అసలు ఆ బాసూ, ఆవిడ తాలూకు మగాడూ ఎలా తగలడితే మనకెందుకు? అసలు ఇక్కడ గయ్ మనాల్సింది నిజానికి నేను కదా. నేను చెయ్యని పాపానికి ఈ రిపేర్ల ఉద్యోగం ఏమిటీ?

ఇంతకీ ఈ డక్ట్ క్లీనింగ్ అనే పదార్ధం ఇండియాలో ఉండదు అనుకుంటాను. ఎందుకంటే అక్కడ అవసరం అయిన గదిలోనే ఎయిర్ కండిషనింగ్ పెట్టుకుంటారు. ఇక్కడ మొత్తం ఇంటికి అంతా కలిపి ఒకటో రెండో సెంట్రల్ ఎయిర్ కండిషనింగ్ & హీటింగ్ యంత్రాలు ఉంటాయి. వాటి నుంచి అన్ని గదులకీ..ఆఖరికి స్నానాల గదుల్లోకి కూడా చిన్నా, పెద్దా గొట్టాలు ఉంటాయి....అంటే మన గుండె కాయ లోంచి పైన తలకాయ, క్రింద కాళ్ళదాకా రక్తనాళాల లాగా. ఎప్పుడైనా తేడా వచ్చినప్పుడు డాక్టర్ దగ్గరకి వెళ్లి బై పాసులు చేయించుకుని రిపేర్లు, క్లీనింగులు ఎలా చేయించుకుంటామో అలాగే ఈ సియర్స్ కంపెనీ లాంటి వారిని ఇంటికే రప్పించుకుని ఈ గొట్టాలు శుభ్రం చేయించుకోవాలి. మన ఒంట్లో ఉన్న గొట్టాలు డాక్టర్ దగ్గరకి తీసుకెళ్లగలం కానీ ఇంట్లో గాలి గొట్టాలు శుభ్రం చెయ్యడానికి బయటకి తీసుకెళ్ల లేం కదా! అంచేత వాళ్ళే మనింటికి రావాలి.

అలా మనం ఆ కంపెనీ వాళ్ళని ఫోన్ లోనో, కంప్యూటర్ లోనో పిలిచినప్పుడు సాధారణంగా జరిగేది ఏమిటంటే పొద్దున్న 8 నుంచి 12 లోగా కానీ, 1 నుంచి 5 లోగా కానీ వస్తాం, రాడానికి అర గంట ముందు ఫోన్ చేస్తాం అని చెప్తారు. అనగా మనం ఆ నాలుగు గంటలూ ఆ వెధవ ఫోన్ ఎప్పుడు మోగుతుందా అని కాసుకుని కూచోవాలి. ఈ రోజుల్లో ఫోన్లు జేబుల్లోనే ఉన్నాయి కాబట్టి పరవాలేదు కానీ పూర్వం ఆ నాలుగు గంటలలో పొరపాటున..పొరపాటున ఏమిటి లెండి..అవసరం ఉండే బాత్ రూమ్ కి వెళ్ళామో....అంతే సంగతులు. ఈ సారి మొత్తానికి చెప్పిన సమయంలో ఇద్దరు వీరులు దిగారు. వాళ్ళని చూడగానే ఒకడి పేరు చిదానంద ఫెర్నాండేజ్ అనీ, రెండో వాడు మహానంద హెర్నాండెజ్ అనీ తెలిసి పోయింది. ఎందుకంటే నేను తలుపు తీయగానే వాళ్ళు ఆప్యాయంగా.




నవ్వుతూ "ఆర్యూ రాహూ?" అని వాళ్ళ యాసలో అడిగారు. ఆ తర్వాత పరస్పరం మామా కోస్తా, తెలంగాణా భాషాలలో విషయాలు కూలంకషంగా చర్చించుకుని నేను వాళ్లకి $250 ఇవ్వడానికీ, వాళ్ళు గొట్టాలలో స్వయంగా దూరే ప్రయత్నం చెయ్యకుండా కేవలం వేక్యూమ్ యంత్రాల ద్వారానే వాటిని శుభ్రం చెయ్యడానికీ ఒప్పందం కుదుర్చుకున్నాం. దానికి ప్రధాన కారణం ఒక వేళ వారిద్దరిలో ఉన్న బొండాంగాడు ఆవేశ పడి పెద్ద గొట్టాం లోకి దూరితే వాడిని బయటకి లాగడం ఎలిజబెత్ బాయ్ ఫ్రెండ్ బాబు తరం కూడా కాదు. ఆ సైజులు తెలియాలంటే ఆ చిదానంద, మహానందాలతో నేను పరమానందంగా దిగిన ఫోటో చూడండి.



ఇక వాళ్ళు పని మొదలు పెట్టి, చకచకా ఐదు గంటలలో హాయిగా నవ్వుకుంటూ మొత్తం గొట్టాల క్లీనింగ్ చేసిన పద్ధతి నిజంగా మెచ్చుకోవాలి. ఆ తతంగంలో రెండు ముఖ్యంగా చెప్పుకోవాలి. అందులో నాకు బొత్తిగా నచ్చనిది ఆ ఇద్దరూ కలిసి నేను హాయిగా పడుకునే పక్క మీద తైతక్క లాడడం. పైన సీలింగ్ లో ఉన్న గొట్టాం శుభ్రపరచడానికి బూట్లతో సహా ఆ సైజు వాడు పరుపు మీదకి దూకి ఒక పట్టాన దిగడే...పైగా సరదా గెంతులు....చిన్న పిల్లలు ట్రాంపోలిన్ మీద ఆడుకున్నట్టు భలే కులాసా చెయ్యడం నాకు అస్సలు నచ్చ లేదు. ఆ సమయం లో మా క్వీన్ విక్టోరియా చూసి ఉంటే వాడిని నరికి పోగులు పెట్టేది. బుద్ధి తక్కువై నేను తీసిన ఫోటో ఆవిడకి చూపించగానే ఆ

యోగం నాకు దక్కింది. కావాలంటే ఆ ఫోటో ఇక్కడ చూడండి.

నాకు భలే నవ్వొచ్చిన విషయం మటుకు ఆ బొండాం చిదానందం ఫెర్నాండేజ్ మా దేవుడి గది లోకి వెళ్ళగానే ఆ బొమ్మలు చూసి హడిలి చచ్చి పోయి హాహా కారాలు పెట్టి రబ్బరు బంతి లా వెనక్కి వచ్చేసి ఆ రెండో బొండాన్ని వాటేసుకున్నాడు. అంటే...అక్కడ పాము మెడలో ఉన్న ఈశ్వరుడూ, పులి మీద కూచున్న దుర్గా మాతా, ఏనుగు మొహం, పెద్ద బొజ్జ తో వినాయకుడూ వగైరాలు చూసి పాపం కుర్రాడు దడుసుకున్నాడు. అప్పుడు నేను నా హిందూ అవతారం ఎత్తి, మనం పాము, తేలు, మర్రి చెట్టు, ఎలక, మనిషి మొదలైన సకల చరాచర ప్రపంచం లోనూ దేవుడినే చూస్తాం అనీ తాయెత్తు ఎత్తు వేసినా వాడు నేనేమన్నా చేత బడి చేస్తున్నానా అని నా కేసి అనుమానం గా చూడడం మొదలు పెట్టాడు. అప్పుడు ఆఖరి అస్త్రం గా "ఆఖరికి నీలో కూడా నాకు దేవుడు కనపడుతున్నాడు" అని ఓ కోత కోశాను. వాడు వెంటనే "అలాగా, రియల్లీ?..నో బడీ టోల్డ్ మి దట్ బిఫోర్" అని కడుంగడు సంతసించి వెంటనే వాళ్ళావిడకి ..ఆవిడో..గర్ల్ ఫ్రెండో తెలీదు..ఫోన్ చేసి...."చూడు, మిస్టర్ రాహూ థింక్ అ యామ్ గాడ్. యు థింక్ అ యామ్ డెవిల్.." అని అర్జంటుగా వాళ్ళ భాషలో వాపోయాడు. పిమ్మట సంతోషంగా మళ్ళీ మా పూజ గదిలోకి వెళ్లి అక్కడి గొట్టాం కూడా శుభ్రం చేశాడు. ఇంత గొడవ జరిగాక పూజ గది లోకి వెళ్ళే ముందు వాణ్ని బూట్లు తీసెయ్యమంటే మళ్ళీ ఏం గొడవ అవుతుందో అని వాడినీ, నన్నూ, ఎందుకయినా మంచిది అని ఆ రెండో బొండాం గాడినీ, ఎలిజబెత్ నీ, ఆవిడ తాలూకు రిపేర్ వాడినీ ..ఇలా అందరి పాపాలనీ క్షమించమని ఆ వినాయకుడినీ, బాపు గారు వేసిచ్చిన ఆ దేవుళ్ళందరినీ కోరుకున్నాను. ఇలాంటి విషయాలలో మా క్వీన్ విక్టోరియాని లాగడం...ఎందుకు లెండి... మొత్తానికి వొంట్లో గొట్టాల మాట దేవుడెరుగు ఇప్పుడు మా ఇంట్లో గొట్టాలు శుభ్రంగా ఉన్నాయి.




**COMMENTS**